క్లుప్తంగా

శ్మశానవాటిక నిర్మాణం పూర్తి



సోమేశ్వరం శివారు సీతంపేటలో ప్రారంభానికి సిద్ధమైన శ్మశానవాటిక

రాయవరం: మండలంలోని సోమేశ్వరం శివారు సీతంపేట గ్రామంలో శ్మశానవాటిక (కైలాసభూమి) నిర్మాణం చేపట్టారు. శ్మశానవాటిక నిర్మాణం చేపట్టాలని ఈ గ్రామస్తులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ ఆరిఫ్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో ఆయన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో ఎమ్మెల్సీ త్రిమూర్తులు గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.7.50 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో అన్ని సౌకర్యాలతో కూడిన శ్మశానవాటిక నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఒక వైపు దహనవాటిక, దానికి ఆనుకుని రుద్రభూమిలో కర్మకాండలు నిర్వహించుకునేందుకు షెడ్డు నిర్మించారు. ఎన్నో ఏళ్లుగా గ్రామస్తుల చిరకాల వాంఛగా ఉన్న శ్మశానవాటికను సకల సౌకర్యాలతో నిర్మించడం పట్ల సీతంపేట గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ఉపవాస దీక్షలు



మండపేట మసీదులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

మండపేట: పవిత్ర రంజాన్ మాసంలోని మూడో శుక్రవారం పట్టణంలోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ఉపవాస దీక్ష చేపట్టారు. స్థానిక కలువపువ్వు సెంటర్లోని జామియా మసీదులో నిర్వహించిన ఉపవాస దీక్షలో ఇమామ్ గులాం ముర్షిద్ రజ్వీ రంజాన్ మాసం ప్రత్యేకతను వివరించారు. ఖురాన్ బోధనలు మానవ జీవన విధానాన్ని మెరుగు పరుస్తాయన్నారు. ఉపవాస దీక్షలోని పవిత్రతను ఆయన వివరించారు. జామియా మసీదు, సైదిల్‌పేటలోని హంజా మసీదు, గాంధీనగర్ లోని ఆల్ అమీనా మసీదు, సప్తగిరి ఏరియా ఆల్ అక్సా మసీదులలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఒడిశా, బీహార్, బెంగాల్ రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వలస ముస్లిం కార్మికులు నమాజ్‌లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దీంతో మసీదులు సందడిగా మారాయి.

వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడిగా రెడ్డి రాధాకృష్ణ

మండపేట: మహాత్మా గాంధీ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన రెడ్డి రాధాకృష్ణ, గౌరవ సలహాదారుడిగా బిక్కిన తాతబ్బాయిచౌదరి, అధ్యక్షుడిగా కోన సత్యనారాయణ, కార్యదర్శిగా షేక్ అబ్బాస్, కోశాధికారిగా రావూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా రెడ్డి రవిరాజు, సభ్యులుగా చల్లా సత్యనారాయణ, కేవీఎస్ ప్రకాశరావు, కేవీఎస్ ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడు కోన సత్యనారాయణ మాట్లాడుతూ ఆధునికత పేరుతో జీవన విధానంలో వచ్చిన మార్పులు ఆరోగ్య సమస్యలు కలిగిస్తున్నాయన్నారు. వాటి ప్రభావానికి దూరమయ్యేందుకు యోగా, వాకింగ్ వంటి వ్యాయామాలు తప్పనిసరి అన్నారు. సీనియర్ సిటిజన్స్ వాకింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వడం పట్టణంలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో లంక సత్యనారాయణ, తిరుశూల వెంకట్రావు, గంపల సత్యప్రసాద్, వీర్రాజు వెంకటేష్, వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, సీహెచ్ సత్యనారాయణరావు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయండి

కాజులూరు: కాజులూరులో శనివారం ఉదయం 10 గంటల నుంచి జరగనున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని సర్పంచ్ దండంగి సరోజిని కోరుతున్నారు. స్థానిక శివాలయం వీధి ఆంజనేయస్వామి గుడి వద్ద సభా ప్రాంగణంలో గ్రామ సర్పంచ్ దండంగి సరోజిని, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ నాయకులు దండంగి చిన్నారావు తదితర నాయకులు శుక్రవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ తదితర నేతలు ఈ కార్యకర్తల సమావేశంలో పాల్గొని రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తలకు దిశ, నిర్దేశాలు చేస్తారన్నారు. మండల గ్రామాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

సాయుధ బలగాల కవాతు

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి, నేలటూరు గ్రామాల్లో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. మండపేట రూరల్ సీఐ శ్రీధర్ పర్యవేక్షణలో అంగర ఎస్సై అందే పరదేశి ఆధ్వర్యంలోని 90 మంది సాయుధ పోలీసులు గ్రామాల వీధుల్లో కవాతు చేశారు. సీఐ శ్రీధర్ మాట్లాడుతూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు తగిన స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించడంలో భాగంగానే కవాతు చేశామన్నారు.

ఎండల వేళ.. చల్లని నీడన..

- కంటి పాపలను కనిపెట్టుకుందాం
- వేసవిలో చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

రాయవరం: సూరీడు సుర్రుమంటున్నాడు. భానుడి భగభగలతో చిన్నారులకే కాదు..పెద్దలకు కూడా చెమటలు పట్టిస్తున్నాడు. ఇటువంటి ప్రతికూల వాతావరణంలో మూడేళ్ల నుంచి ఆరేళ్ల చిన్నారుల వరకూ అంగన్‌వాడీ కేంద్రాలకు, ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు పాఠశాలలకు హాజరవుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఏప్రిల్ 18 నుంచి హాఫ్ డే స్కూల్స్‌ను నిర్వహిస్తోంది. ఉదయం బడి కెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చి ఇళ్ల వద్ద ఎక్కువ సమయం గడుపుతున్న పిల్లలను ఎండలో తిరగనివ్వకుండా ఆపడం తల్లిదండ్రులకూ కష్టమవుతోంది. పిల్లలపై ప్రచండ భానుడి ప్రతాపం పడకుండా తల్లిదండ్రులు వారి కంటిపాపలను ఓ కంట కనిపెడుతూ ఉండాలి. బడికొచ్చే విద్యార్థులు వడదెబ్బకు గురికాకుండా చూడాల్సిన 'గురు'తర బాధ్యత ఉపాధ్యాయులపైనా ఉంది. పిల్లల విషయంలో అటు టీచర్లు, ఇటు కుటుంబ పెద్దలు జాగ్రత్తలు తీసుకుంటే బాల్యానికి భానుడి తాకిడి ఉండదు.

తగు మోతాదులో నీరు తప్పనిసరి

శరీరంలో అన్ని అవయవాలు సమర్థంగా పనిచేయాలంటే తగిన మోతాదులో నీరు అవసరం. లేకుంటే వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. వేసవిలో పిల్లలు ఎక్కువ సమయం ఇంటి దగ్గరే ఉంటారు. వారు ఆటపాటల్లో పడి నీళ్లు తాగడంపై దృష్టి పెట్టరు. తల్లిదండ్రులు కూడా చిన్నారులు నీరు తీసుకునే విషయమై ఓ కంట కనిపెడుతుండాలి. ప్రస్తుతం 38 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలకు శరీరంలో నీరు ఆవిరి అవుతోంది. చిన్నారుల శరీరంలో నీటి పరిమాణం తగ్గకుండా నిర్దేశిత మోతాదులో క్రమం తప్పకుండా నీరు తాగించాల్సిన అవసరం ఉందని గుర్తించాలి.

చిన్నారులకు ఎండ వేడిమి తాలూకు ప్రభావం తెలియదు. వేకువ జామున నిద్ర లేచింది మొదలు పడుకునే వరకూ వారు మదికి తోచిందల్లా చేస్తుంటారు. దీన్ని సున్నితంగా కట్టడి చేయాల్సిన బాధ్యత కుటుంబ పెద్దలపై ఉంది. చిన్నారులను మధ్యాహ్నం కొద్దిసేపు నిద్రపోయేలా చూడాలి. సాయంత్రం ఇళ్ల ఆవరణలో చెట్లు ఉంటే ఆ నీడలో గడిపేలా చూడాలి. కాలక్షేపానికి వారికి ఇష్టమైన ఆట వస్తువులు సమకూర్చాలి. ఆ విధంగా సూర్య ప్రతాపానికి గురికాకుండా చూడాలి

వీటిని పాటించాలి

పిల్లలతో క్రమం తప్పకుండా వ్యాయామం చేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. ఎండలో పిల్లలకు ఏ పని చెప్పకుండా వారికి తగిన నిద్ర, విశ్రాంతి అవసరం. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకు వెళ్ళమని చెప్పాలి. గొడుగు లేకుంటే తలకు టోపీ పెట్టుకోమని చెప్పాలి. మండుటెండలో తేలికపాటి వస్త్రాలు ధరించమని చెప్పాలి. సెల్ ఫోన్ చేతిలో ఉంటే చిన్నారులు ఎక్కడికి వెళ్లకుండా ఒకచోటనే కూర్చుంటారనే భావన చాలా మంది తల్లిదండ్రుల్లో ఉంటుంది. అలాగని నిఘా లేకపోతే దుష్ప్రభావాలకు లోనయ్యే ప్రమాదం ఉంటుంది.

అప్రమత్తతకు మించిన చికిత్స లేదు



తల మీద పడిందే ఎండ అనుకోవడం సరికాదు. మన శరీరం చుట్టూ ఎంత వేడి ఉందనేది గ్రహించాలి. అందుకే కొన్ని సందర్భాల్లో ఎన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్న శరీరంలో డీ హైడ్రేషన్ మొదలవుతుంది. పుచ్చకాయలు, బొప్పాయి చెరకు రసం వంటివి తీసుకుంటే ఆరోగ్యానికి మేలు. ఐస్ వాటర్ తాగడం శ్రేయస్కరం కాదు. అప్రమత్తతకు మించిన చికిత్స లేదని గ్రహించాలి.

– డాక్టర్ అనిరుథ్, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాయవరం

పాఠశాలల్లో మేలుకొలుపు అవసరం

విద్యార్థులు పాఠశాల నుంచి మధ్యాహ్నం మండుటెండలో ఇంటికి వెళ్తున్నారు. ఎండలో తిరిగితే కలిగే దుష్పరిణామాల గురించి ఉపాధ్యాయులూ అవగాహన కల్పించాలి. నీడ పట్టున ఉండాలని, ఓఆర్ఎస్‌తో పాటు పండ్లరసాలు, కొబ్బరి నీళ్లు, నిమ్మ రసం వంటి ద్రావణాలు తీసుకోవాలని తెలియజెప్పాలి. తల్లిదండ్రుల కన్నా ఉపాధ్యాయులు మాట విద్యార్థికి వేదవాక్కు అవుతుంది. అందుకే విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే వాటిని కచ్చితంగా పాటిస్తారు. పాఠశాలల్లో విద్యార్థులను చైతన్యవంతం చేస్తే ప్రతి ఒక్కరూ ప్రమాణాలను పాటించడానికి అవకాశం ఉంటుంది. తద్వారా ఎండ వేడిమి వలన కలిగే డీహైడ్రేషన్ నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.

వైఎస్సార్ సీపీలో టీడీపీ నేత వీరన్న



కోరుమిల్లిలో ఎమ్మెల్సీ తోటతో పార్టీలో చేరిన సుంకర వీరన్న

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లికి చెందిన టీడీపీ సీనియర్ నేత సుంకర వీరన్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కోరుమిల్లిలో శుక్రవారం వీరన్న నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరన్నతో పాటు కోరుమిల్లి, మాచర గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు, తటస్థులు సుమారు 20 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. చేరిన వారిలో తోటకూర చిట్టిబాబు, తాడాల శ్రీనివాస్, కరెడ్ల గుణ్ణేశ్వర రావు, మేడిశెట్టి శ్రీనివాస్, సుంకర సతీష్, సుంకర జయబాబు, అప్పన్న తదితరులు ఉన్నారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల మేలుకోరే వైఎస్సార్ సీపీలో కొనసాగడం ద్వారా పేదలకు న్యాయం చేశామన్న సంతృప్తి కలుగుతుందన్నారు. పార్టీలో చేరినవారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సలాది వీరబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది చిన్ని, నాయకులు ఆచంట వీవీ స్వామి, సుంకర చిన్న, మాకా బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పాలన ఒక సువర్ణాధ్యాయం

ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్



వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసి స్వాగతం పలుకుతున్న సూర్యప్రకాష్

కాజులూరు: రాష్ట్ర చరిత్రలో సీఎం జగనన్న పాలన ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. గొల్లపాలెంలో శుక్రవారం వైఎస్సార్ యువసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉంగరాల శివ ఆధ్వర్యంలో గొల్లపాలెం, డేగలపేటలకు చెందిన పలువురు తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాల ద్వారా సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరారన్నారు. అనంతరం ఉంగరాల శివ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన పోతురాజు సత్యనారాయణ, పోతురాజు దుర్గా, కొండేటి వీర్రాజు, ధోనిపూడి సూర్యనారాయణ, వడ్డాది శివ, రాజు, కృష్ణ తదితరులు మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనతో రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని రానున్న ఎన్నికల్లో పార్టీ మరోసారి విజయం సాధించి అధికారంలోకి వచ్చేలా తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, రేఖపల్లి సత్తిబాబు, సత్తి సూరారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేస్తాం

పార్టీలో చేరిన ముస్లిం యువకులు



హసన్‌బాదలో పిల్లి సూర్యప్రకాష్ సమక్షంలో పార్టీలో చేరిన ముస్లిం యువకులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ నేతృత్వంలో పార్టీ గెలుపునకు అలుపెరగకుండా కృషి చేస్తామని పార్టీలో చేరిన ముస్లిం యువకులు అన్నారు. మండలంలోని హసన్‌బాదలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్ర బోస్ ఇంటి వద్ద శుక్రవారం ద్రాక్షారామకు చెందిన మీర్జా మహదీ హుస్సేన్ ఆధ్వర్యంలో ముస్లిం యువకులు పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి కోఆర్డినేటర్ సూర్యప్రకాష్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ ముస్లింకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికి దక్కితే, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా నవరత్న పథకాల ద్వారా అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మహ్మద్ గౌస్, మహ్మద్ యాకూబ్, షేక్ చాను, వైస్ ఎంపీపీ శాకా బాబీ, ప్రకాష్‌రెడ్డి, పోలిశెట్టి తాతబ్బాయి, కోటిపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక కొత్తపూల ఉత్సవాలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ఆవరణలో గురువారం రాత్రి మన్యసీమ నుంచి తీసుకువచ్చిన మోదుగుపూలతో అలంకరించిన పెద్దగరగతో మూడో విడత కొత్తపూలు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. చర్మ వాయిద్యాల దరువుకు అనుగుణంగా ఆలయ ఆసాదుల బృంద సభ్యులు గరగలను నెత్తిన ధరించి చేసిన నృత్యాలు భక్తులను అలరించింది. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి కొత్తపూల ఉత్సవాలను తిలకించారు. పూలగరగకు పూలు, అగరవత్తులు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన శక్తివేషాలు, విచిత్ర వేషధారణ, కోయ నృత్యాలు తదితర వినోద కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. చల్ల గరగ రూపంలో ఉన్న అమ్మవారికి నిర్వహించిన గ్రామోత్సవం ద్వారా ఇంటింటికీ దర్శనమిచ్చింది. ఇప్పటికే విద్యుత్‌దీపాలంకరణ, చలువ పందిళ్ల ఏర్పాటు చురుగ్గా సాగుతుంది. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ, జేఏ డి.భాస్కర శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అక్రమ మద్యం ధ్వంసం

ఆలమూరు: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో శుక్రవారం అక్రమ మద్యం బాటిళ్ల ధ్వంసం జరిగింది. రాష్ట్ర ఎస్ఈబీ డిప్యూటీ కమిషనరేట్ ఆదేశాల మేరకు అమలాపురం ఏఎస్పీ అమర్‌బాబు సమక్షంలో ఎస్సై ఎ.సత్యవేణి ఆధ్వర్యంలో సుమారు రూ.90 వేలు విలువైన 1152 మద్యం బాటిళ్లు, 184 లీటర్ల సారా ధ్వంసం చేశారు. అందులో 720 బాటిళ్లు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కాగా 216 బాటిళ్లు పెయిడ్ లిక్కర్‌కు సంబంధించినట్లు ఆమె పేర్కొన్నారు. అక్రమంగా సారా తయారు, విక్రయించినా, అక్రమ మద్యాన్ని తరలించి కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు. ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం మండలాల్లో ఎక్కడైనా అక్రమ మద్యం ఆనవాళ్లు ఉంటే 9959841282 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

కనీవినీ ఎరుగతి రీతిలో పేదలకు సంక్షేమం

నిడసనమెట్ట పర్యటనలో ఎమ్మెల్సీ తోట



గ్రామ పర్యటనలో ఎమ్మెల్సీ తోట, జెడ్పీటీసీ అబ్బు, ఎంపీపీ సత్యవేణి

కపిలేశ్వరపురం: రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమాన్ని పెద్ద ఎత్తున అందించిన ఘనత కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మండపేట అసెంబ్లీ అభ్యర్థి తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని నిడసనమెట్ట, వల్లూరు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు స్వగ్రామమైన నిడసనమెట్టలో ఇంటింటి పర్యటనకు గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. మహిళలు ఎమ్మెల్సీ తోటకు హారతి పట్టారు. ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన లబ్ధిదారులు ఎమ్మెల్సీ తోట పర్యటనలో అడుగులో అడుగు వేస్తూ సంతోషంగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ రాజకీయాలను ఎన్నికలు వరకే చూస్తూ అధికారం చేపట్టాక రాజకీయాలకు అతీతంగా పేదరికమే అర్హతగా సంక్షేమాన్ని అందించిన గొప్ప మనస్సు గల పాలకుడు సీఎం జగన్ అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు మాట్లాడుతూ కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విశేషంగా కృషి చేశారన్నారు. అనంతరం వల్లూరు గ్రామంలో ఎమ్మెల్సీ తోట పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు తోట పృథ్వీరాజ్, సర్పంచ్ పుట్టపూడి పవన్, ఎంపీటీసీ సభ్యుడు పెందుర్తి శిరీష, పీఏసీఎస్ చైర్మన్ ముత్యాల సతీష్, నాయకులు చేంబ్రోలు వీరభద్రరావు, రుద్రయ్య చౌదరి, ఇరు గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు పుట్టా కృష్ణమూర్తి, పిల్లా సాయిబాబు, పలివెల మధు, అతికెల శంభులింగం, పుట్టా సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



కపిలేశ్వరపురంలో శిలువతో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవ భక్తులు



మండపేటలో గుడ్ ఫ్రైడే ర్యాలీలో క్రైస్తవ భక్తులు



తోటపేట కతోలిక జయజేసు చర్చి విశ్వాసుల శిలువ యాత్ర

రాయవరం: గుడ్ ఫ్రైడే వేడుకలను మండలంలోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రాయవరంలోని అపొస్థలిక్ ప్రేయర్ హౌస్‌లో క్రీస్తు శ్రమలను ధ్యానిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ గొడుగు అనిల్‌కుమార్ క్రైస్తవులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీస్తు లోక రక్షణ కోసం తనను తాను బలిగా అర్పించారని, ఇది ప్రజల పట్ల దేవునికి ఉన్న ప్రేమ వల్లనే సాధ్యమైందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు త్యాగాలను స్మరించుకోవాలన్నారు. మండలంలో పలు చర్చిల్లో ఏసును స్తుతిస్తూ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ప్రత్యేక గీతాలను ఆలపించారు. మండలంలోని పసలపూడి, వెదురుపాక, వి.సావరం, లొల్ల, సోమేశ్వరం, మాచవరం, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రై డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, అచ్యుతాపురం, కాలేరు, నల్లూరు, మాచర, టేకి, కోరుమిల్లి, నాగులచెరువులు, వాకతిప్ప, అద్దంకివారి లంక, కేదారిలంక గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ర్యాలీ నిర్వహించారు.



పసలపూడి చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

మండపేటలో...

పట్టణంలోని పలు చర్చిల్లో గుడ్ ఫ్రైడేను క్రైస్తవ భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో పురవీధుల్లో క్రీస్తు శిలువ వేషధారణలతో ప్రదర్శనను నిర్వహించారు. మండపేట రూరల్ మండలంలోని గ్రామాల నుంచి తరలి వచ్చిన సంఘస్తులు ర్యాలీలో పాల్గొన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ మానవాళి మేల్కొలుపునకు క్రీస్తు జీవితంలోని ఘటనలు తార్కాణమన్నారు. ద్వారపూడి, తాపేశ్వరం, ఏడిద, మారేడుబాక, జెడ్.మేడపాడు, మెర్నిపాడు, వెలగతోడు, పాలతోడు, వేములపల్లి, కేశవరం, అర్తమూరు, ఇప్పనపాడు గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవ భక్తులు ప్రార్థనలు చేశారు.



అముజూరు మన్నా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

కె.గంగవరం మండలంలో..

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో శుభ శుక్రవారాన్ని విశ్వాసులు చర్చిల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. మండలకేంద్రమైన కె.గంగవరంలో ఉన్న చర్చికి పలు గ్రామాల విశ్వాసులు శిలువను మోస్తూ మోకాళ్లపై చర్చికి వెళ్లి ప్రార్థనలు చేశారు. మండలంలోని అముజూరు మన్నా చర్చిలో పాస్టర్ యం.జాన్‌బాబు శుభ శుక్రవారం ప్రత్యేకతను విశ్వాసులకు వివరించారు. క్రీస్తు సిలువలో లోక ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ఏడు మాటలను గుర్తు చేశారు. క్రీస్తు చూపిన మార్గంలో విశ్వాసులు నడిచి ఇతరులకు మార్గదర్శంగా ఉండాలని బోధించారు. అనంతరం ప్రత్యేక గీతాలు ఆలాపించి ప్రార్థనలు చేశారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని క్రీస్తు బోధనను ఆసక్తిగా విన్నారు.



రామచంద్రపురంలో శిలువను మోస్తూ భక్తిగీతాలతో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

కిటకిటలాడిన చర్చిలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేట కథోలిక జయజేసు చర్చి ఫాదర్‌లు జోసెఫ్ ప్రభాకర్, వినయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో సుమారు 2 వేల మంది క్రైస్తవులు తిర్దంపేటలోని చర్చి నుంచి తోటపేట చర్చి వరకు శిలువ యాత్ర నిర్వహించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వెల్లలో ఏసు మహిమాలయ బాప్టిస్టు చర్చిలో పాస్టర్లు రెవరెండ్ కె.శామ్యూల్‌ప్రసాద్, రెవరెండ్ కె.బాయ్‌ల ఆధ్వర్యంలో క్రీస్తు సందేశం అందజేశారు. అధిక సంఖ్యలో విశ్వాసులు, యువజనులు పాల్గొన్నారు. ద్రాక్షారామలో గుడ్ న్యూస్ మినిస్ట్రీస్ చర్చిలో డాక్టర్ రెవరెండ్ జాన్ బెన్నీ ఆధ్వర్యంలో ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు.

రామచంద్రపురం: నియోజకవర్గంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల ఆర్‌సీఎం చర్చిలో రెవరెండ్ ఫాదర్ అంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు చేశారు. చర్చి వద్ద నుంచి రాజగోపాల్ సెంటర్, మీదుగా ప్రధాన రహదారిలో శిలువను మోస్తూ ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనలో భక్తిగీతాలను ఆలపిస్తూ ప్రార్థనలు చేశారు. అనంతరం దేవాలయంలో ఫాదర్ అంతయ్య దివ్యపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ మానవ జాతి మనుగడ కోసం శాంతి శిలువ మీద ప్రాణత్యాగం చేశారన్నారు. పాపుల రక్షణ కోసం ఏసు క్రీస్తు శిలువయాగం పొందారని ఫాదర్ అంతయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆలపించిన క్రీస్తు భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి.